క్లుప్తంగా

మహిళా సంఘాల సంఖ్య పెంచండి

రాజాం: మండలంలో మహిళా సంఘాల సంఖ్య పెరగాల్సి ఉందని, ఈ మేరకు అన్ని గ్రామాల్లో సంఘాల్లో లేని సభ్యులను గుర్తించి, కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని సీసీలు, సీఎఫ్‌లకు వైకేపీ ఏపీఎం చిరంజీవి సూచించారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన సీసీలు, సీఎఫ్‌లతో సమావేశమైన ఆయన బ్యాంకు రుణాల చెల్లింపులు, కొత్త రుణాల మంజూరు, మహిళా మార్ట్‌ల ఏర్పాటు వంటి అంశాలపై ఆరాతీశారు. వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల లబ్ధిదారుల వివరాలను అప్‌డేట్ చేయాలని, కొత్తవారికి పథకాలు వర్తించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు దధికుమార్, హేమలత పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణానికి చర్యలు

తెర్లాం: మండలంలోని చీకటిపేట పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశాల మేరకు సర్పంచ్ మూడడ్ల పార్వతి ఆధ్వర్యంలో నిర్మాణానికి అవసరమైన మార్కింగ్‌ను సంబంధిత అధికారులు సోమవారం ఇచ్చారు. ఎస్‌డబ్ల్యూపీసీని త్వరితగతిన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మంనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామ ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మంనాయుడి మృతి పార్టీకి తీరని లోటని, నిరంతరం గ్రామ అభివృద్ధికి ఆయన తపన పడేవారని కొనియాడారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వృక్షాలు, స్తంభాలు నేలమట్టం



బొబ్బిలి: కూలిన భారీ వృక్షం కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

బాడంగి/బొబ్బిలి: మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు విరిగిపడడంతో పాటు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో బాధిత ప్రాంతాల్లో విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు గ్రామమైన ఎరుకులపాకలలో ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పి.పార్వతి, ఎంపీటీసీ సభ్యులు గౌరు ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్‌ఐ ఆర్.జయంతి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

త్వరితగతిన భూముల రీసర్వే

వంగర: త్వరితగతిన భూముల రీసర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల సర్వేయర్ వై.అప్పలనాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో సీసీపీ పాయింట్లను పరిశీలించిన ఆయన డ్రోన్ ద్వారా సర్వే పాయింట్లను గుర్తించి, సర్వే వేగవంతానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం

రాజాం సిటీ: స్థానిక మల్లిఖార్జునకాలనీలోని అనాథ వృద్ధాశ్రమానికి రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. తన మనుమరాలు కోశల పుట్టినరోజు సందర్భంగా ఈ మొత్తాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. కొండంపేటలో కొత్తగా నిర్మిస్తున్న వృద్ధాశ్రమానికి తమవంతు సహకారం అందిస్తామని నిర్వాహకుడు పి.శ్రీనివాసరావుకు తెలిపారు. కార్యక్రమంలో కె.అనంతరావు, చంద్రావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ

రాజాం సిటీ: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ స్థానిక మల్లిఖార్జున కాలనీ, లచ్చయ్యపేట ప్రాంతాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్నేళ్ల లోపు వయసున్న పిల్లలను కేంద్రాలకు పంపించాలని, ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సన్యాసమ్మ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



వంగర: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



రామభద్రపురం: లబ్ధిదారు మహిళకు ఆమె అందుకున్న పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొప్పరవలస గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రంలో అమలులోని పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సీఎం జగన్ తన పాదయాత్ర ఆరంభం నుంచి ప్రజాసంకల్పయాత్ర వరకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి, శభాష్ అనిపించుకున్నారన్నారు. గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు తీసుకువచ్చారన్నారు. ఆయా వ్యవస్థల ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. నవరత్నాలు పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాల ద్వారా గడిచిన నాలుగేళ్లలో రూ.3 లక్షల కోట్ల రూపాయలు ప్రజల ఖాతాల్లోకి డీబీటీ విధానం ద్వారా జమ చేసి, పాలనలో పారదర్శకత కనబరిచారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అయితే వాటిని ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీదే ఘనవిజయమని, మరోసారి సీఎం జగన్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.లలితకుమారి శ్రీరామ్మూర్తి, ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కె.ఉమామహేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం. విజయలక్ష్మి గంగారావు, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు: ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని చొక్కాపు, చింతల, గూల వీధుల్లో సోమవరం పర్యటించిన ఆయనకు స్థానికులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరుతోందన్నారు. 2014–19 వరకు ఐదేళ్ల టీడీపీ పాలనలో ప్రజలకు చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. దొరికింది దోచుకునే ధోరణిలో టీడీపీ పాలించిందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు కూడా జోరుగా సాగుతున్నాయన్నారు. గ్రామంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలతో పాటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం జగన్ నిలిచారన్నారు. బడుగు, బలహీనవర్గాలకు అగ్రతాంబూలం ఇస్తూ ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. 2024 ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారమని, సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలనాయుడు, మండల జేఏసీ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదేశించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజాం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించిన ఆయన గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం, లింకు రోడ్ల ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, నిధులు విడుదలపై పార్టీ నేతలను ఆరాతీశారు. అలాగే మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిన గ్రామాల వివరాలు తెలుసుకోవడంతో పాటు ఆయా గ్రామాల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఇంటింటికీ తాగునీటి పథకం ద్వారా ఇచ్చిన నిధులు, గ్రామాల్లో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజల్లో వస్తున్న స్పందనను తెలుసుకోవడంతో పాటు పలు గ్రామాల్లో కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించి, రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే సన్నద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, నేతలు వై.వెంకటేష్, జి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రేగిడి: ఎంఆర్‌సీలో కొత్త ఎంఈఓలను సత్కరిస్తున్న సిబ్బంది

రేగిడి: ఎంఈఓగా ఎంవీ ప్రసాదరావు, రెండో ఎంఈఓగా బొత్స ఎరకయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మొదటి ఎంఈఓ అడ్మినిస్ట్రేటివ్ పనులు పర్యవేక్షించగా, రెండో ఎంఈఓ సాధారణ పరిపాలన కొనసాగిస్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఎంఈఓలకు ఉపాధ్యాయులు, యూనియన్ సంఘాలు అభినందనలు తెలిపి, ఘనంగా సత్కరించారు.

రామభద్రపురం: రెండో ఎంఈఓగా ఆర్.పెంటయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాలూరు మండలంలోని మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ మండలానికి రెండో ఎంఈఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంఈఓ తిరుమలప్రసాద్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సంతకవిటి: మండల ఎంఈఓ–2గా సీహెచ్ భాస్కరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మందస మండలంలోని సొండిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, పదోన్నతిపై మండలానికి వచ్చారు.

ప్రతిభకు గుర్తింపు

పదో తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం గుర్తించి, ప్రోత్సహిస్తోంది. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలాల్లోని పలు గ్రామాల పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రధానోపాధ్యాయుల చేతులమీదుగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసాపత్రం, మెడల్ అందజేసి, సోమవారం సత్కరించారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వక్తలు ఆకాంక్షించారు.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



రేగిడి: ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఎస్‌ఐ శ్రీనివాసరావు



రేగిడి: సంకిలి పాఠశాలలో విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



రాజాం సిటీ: పాగిరి పాఠశాలలో సత్కారమందుకున్న విద్యార్థులతో సర్పంచ్ కృష్ణవేణి, హెచ్‌ఎం మురళీకృష్ణ



మెంటాడ: విద్యార్థినికి ప్రశంసాపత్రం, మెడల్ అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు



వంగర: అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సత్కారం



తెర్లాం హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలును సన్మానిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు



రాజాం: సత్కారం అందుకున్న జగనన్న ఆణిముత్యాలు

ప్రతిఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలి

తెర్లాం: ప్రతిఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. సోమవారం మండలంలోని టెక్కలివలస, కాగాం, చుక్కవలస గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతీ ఇంట్లో ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో ఈ త్రైత సిద్ధాంత భగవద్గీతను రాయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమితి హిందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ సభ్యులు గణేష్, రామినాయుడు, సరస్వతి, రామలక్ష్మి, భవానీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నేడు రథయాత్ర

రాజాం: పట్టణంలో శివం సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో జగన్నాథుని రథయాత్ర మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ యాత్రలో అందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

విత్తనాల పంపిణీ

రాజాం: మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్ చేతుమీదుగా సోమవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు ప్రభుత్వం విత్తనాలు అందిస్తోందని, విత్తనాలు ఎరువులు కావాల్సిన వారు ఆర్‌బీకేల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

తెర్లాం: మండలంలోని పెరుమాళి, తెర్లాం, కొరటాం, ఎం.ఆర్.అగ్రహారం గ్రామాల్లో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్ కోరారు.

వినతిపత్రం అందజేత

రాజాం సిటీ: స్థానిక సారధి రెవెన్యూ పరిధిలోని 8 పోలింగ్ బూత్‌ల ఓటర్ల లిస్టుల్లో మార్పులు, చేర్పులు చేపట్టాలని సారధికి చెందిన టంకాల వెంకటేశం ఎన్నికల డీటీ ప్రకాష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్లే కాకుండా వేరే పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్లు కూడా నమోదై, ఉన్నారని, చాలా కేంద్రాల్లో మరణించిన వారి ఓట్లను డిలీట్ చేయలేదన్నారు.

నిధులను సక్రమంగా వినియోగించండి

రాజాం సిటీ: మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించాలని పీఎఫ్ఎంఎస్ రాష్ట్ర నోడల్ అధికారి ప్రియాంక నవీనే సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె కార్యాలయానికి వస్తున్న నిధులు, చేస్తున్న ఖర్చుల వివరాలను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావును అడిగి తెలుసుకున్నారు. పీఎఫ్ఎంఎస్ నిధులు, చెల్లింపులు, పీడీ అకౌంట్‌లోని నిధుల గురించి ఆమెకు వివరించారు. చెత్త సేకరణకు మంజూరైన రూ.70 లక్షల నిధులను ఎందుకు వినియోగించ లేదని ఆమె ప్రశ్నించగా, మున్సిపాలిటీలో చెత్త సేకరణకు స్థల సమస్య ఉందని, దీనిపై రెవెన్యూ అధికారులను సంప్రదించామని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇంజినీరింగ్ పనుల్లో పురోగతి సాధించాలని, వర్షాలు పడకముందే డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్ల పనులు పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. మున్సిపల్ అభివృద్ధికి కావాల్సిన అంశాలతో తమకు దరఖాస్తు చేస్తే ఆ దిశగా చర్యలు చేపడతామని కమిషనర్‌కు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించి, నిధుల జమ, ఖర్చులపై సూపరింటెండెంట్ జీవీ రాజ్యలక్ష్మిని ఆరాతీశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే మళ్లీ ప్రజలు పట్టం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీకే ప్రజలు పట్టంగట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి, రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. తాను మంచి చేశాననని నమ్మితేనే తనను రెండోసారి ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను అడుగుతున్నారన్నారు. గతంలో ఏ సీఎం కూడా ఇలా అడిగిన దాఖలాలు లేవన్నారు. ముందు గెలిపించండి తర్వాత అభివృద్ధి చేసి చూపిస్తాననని చెప్పినవాళ్లే తప్ప.. అభివృద్ధి, సంక్షేమం చేసి చూపించి, ఓట్లు అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్ ఒక్కరేనన్నారు. టీడీపీ హయాంలో గెలిచిన ప్రజాప్రతినిధులు ఎవరూ ఎన్నికలప్పుడు తప్ప, మిగతా సమయాల్లో ప్రజల మధ్య లేరని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ నాయకులు మాత్రం నిత్యం ప్రజల మధ్యే ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అప్పటి టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని కోరారు. చంద్రబాబు అండ్ కో..కు అవకాశం ఉంటే దోచుకోవడం, పంచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు మేలు చేయాలన్న తపన, ఆసక్తి లేదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అబద్ధపు హామీలతో ప్రజలకు మరోసారి మోసగించేందుకు టీడీపీ సిద్ధమైందని, అయితే మళ్లీ మళ్లీ మోసం చేసే టీడీపీని ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేగానే కాకుండా మంత్రిగా ఉన్న బొబ్బిలి రాజులు గానీ, టీడీపీ ప్రజాప్రతినిధులు గానీ ఎప్పుడైనా ప్రజల ఇళ్ల ముందుకు వచ్చి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారా.. పరిష్కరించారా అని ప్రశ్నించారు. మరో 30 ఏళ్ల ప్రజానాయకుడు, సీఎం జగనే ముఖ్యమంత్రి అని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, బొబ్బిలి మున్సిపాలిటీ చైర్మన్ ఎస్.వి. మురళీకృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష శిబిరాలు'పై అవగాహన



బాడంగి: సూచనలిస్తున్న ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ రామారావు



తెర్లాం సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ హరి

తెర్లాం: స్థానిక సచివాలయం–1, 2లో వలంటీర్లకు జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. తెర్లాం–1 సచివాలయ విస్తరణాధికారి(ఈఓ)సూరిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ హరి మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయంతో పాటు ప్రభుత్వం మంజూరు చేస్తున్న తొమ్మిది రకాల ధ్రువపత్రాల్లో ఏది కావాలో అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత సచివాలయంలో మండల స్థాయి అధికారులు నిర్వహించే కార్యక్రమంలో ధ్రువపత్రాలు పొందేందుకు దరఖాస్తులు సమర్పించిన వారికి ధ్రువపత్రాలు అందజేయాల్సి ఉంటుందన్నారు.

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో ఎంపీడీఓ బాసూరి శంకరరావు సోమవారం సమావేశమై, జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23వ తేదీన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారని, జూలై 1వ తేదీ నుంచి సచివాలయాల వారీగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రజాసమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులైన వారికి పథకాలు, ధ్రువపత్రాలు మంజూరయ్యేలా చూడాలని ఎంపీడీఓ తెలిపారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై వలంటీర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి జరిగే ఈ కార్యక్రమంలో అర్హులై ఉండి, ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలు సేకరించాలని, అలాగే బర్త్, డెత్, మ్యుటేషన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్స్ వంటివి అవసరమైన వారికి అందివ్వాలని సూచించారు.

'స్పందన' సమస్యలు పరిష్కరించాలి



తెర్లాం: వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



బొబ్బిలి: స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులు

తెర్లాం: స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 9 వినతులు రాగా, వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వంగర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజలు సమర్పించిన పలు వినతులను అధికారులు పరిశీలించారు. సచివాలయాల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఆర్‌డీఓ, తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజలు సమర్పించిన వినతులను అధికారులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

సంతకవిటి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారుల దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ జి.వి.రవికుమార్ సూచించారు. అలాగే జగనన్నకు చెబుదాం 1902 టోల్‌ఫ్రీ నంబరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయతీరాజ్ జేఈ రియాజ్ పాల్గొన్నారు.